సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 7 । జూన్ । 2024



ఉచిత శిక్షణ..
ఉపాధి కల్పన 8లో



తళుకుల మాటున
కల్తీ మాయ 8లో



బై.. బై..
వైజాగ్ 8లో

న్యూస్‌రీల్

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో **నాలుగో** యూనిట్‌లో బుధవారం **తెల్లవారు జామున** సాంకేతిక కారణాలతో **నిలిచిపోయిన** విద్యుత్ ఉత్పత్తిని మరమ్మతుల **అనంతరం** తిరిగి గురువారం తెల్లవారు జామున పునరుద్ధరించారు. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో బుధవారం తెల్లవారు జామున విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి యూనిట్‌లో ఏర్పడిన రిపేర్లను త్వరితగతిన పూర్తి చేసి గురువారం తెల్లవారుజామున 3.55 గంటలకు నాల్గో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం సంస్థలో నాలుగు యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు.

డ్రగ్స్‌తో ఇద్దరి అరెస్ట్

మరొకరు పరార్

అల్లిపురం: ఎండీఎంఏ(మిథైలెన్డియోక్సి మెథాంఫేటమిన్) డ్రగ్‌ను కలిగి ఉన్న ఇద్దరు యువకులను మహారాణిపేట పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 3.316 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. టర్నల్ చౌల్ట్రీ బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అనకాపల్లి జిల్లా పరవాడ మండలం బోనంగి గ్రామానికి చెందిన మంగళ సాయిరామ్, పాతగాజువాక ఎల్‌వీ నగర్‌కు చెందిన తుల్లాలు సంగ్రామ్ సాహూలను మహారాణిపేట పోలీసులు, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద 3.316 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ లభించింది. డ్రగ్‌తో పాటు స్కూటీ, రూ.16,580 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో మరొకరు డ్రీమ్ లాంచర్ ఈవెంట్ మేనేజర్, గాజువాకకు చెందిన దిలీప్ అలియాస్ అర్జున్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు కోసం బెదిరింపులు

రూ.20 లక్షలు ఇవ్వకుంటే కుమారుడిని చంపేస్తామని వాట్సాప్ మెసేజ్

మధురవాడ: రూ.20 లక్షలు ఇవ్వకుంటే కుమారుడిని చంపుతామని వాట్సాప్ నెంబరు నుంచి బెదిరింపుల మెసేజ్‌లు వస్తున్నాయని ఓ వ్యక్తి పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. దీనికి సంబంధించి పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీఎంపాలెం కార్‌షెడ్ జంక్షన్ వద్ద పోతిన వెంకటరావు భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. అతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా, భార్య చార్టెడ్ అకౌంటెంట్. వారికి ఇద్దరు కుమారులు. ఈనెల 2వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో 74163 84335 నెంబర్ నుంచి వెంకటరావు వాట్సాప్‌కు ఫోన్ వచ్చింది. మీ కుమారుడిని చంపేస్తామని బెదిరించాడు. దీంతో అతడు నంబర్‌ను బ్లాక్ చేశాడు. భయాందోళనతో ఈనెల 3, 4 తేదీల్లో కుటుంబ సభ్యులంతా బయటకు కూడా వెళ్లలేదు. ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నెంబర్ అన్ బ్లాక్ చేశాడు. మధ్యాహ్నం 1.35 గంటలకు అదే నెంబర్ నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. కానీ ఎవరూ మాట్లాడలేదు. రూ.20 లక్షలు ఇవ్వాలని వాట్సాప్‌లో మెసెజ్‌లు వచ్చాయి. రూ.5 లక్షలు ఇవ్వడానికి అంగీకరించి 6వ తేదీ వరకు సమయం కావాలని అభ్యర్థించాడు. 6వ తేదీ 7.59 గంటలకు డబ్బులు తేవాలని మెసేజ్ వచ్చింది. స్పందించక పోతే ఏమి జరుగుతుందోనని భయంతో పీఎంపాలెం పోలీసులకు వెంకటరావు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిక్కు దిగాల్సిందే..

- **మందుబాబులకు పోలీసులు కళ్లెం**
- **విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**
- రోజుకు 125 వరకు కేసులు నమోదు.. కొంత మందికి జైలు శిక్ష
- మద్యం తాగి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు
- రోడ్డు ప్రమాదాల కారణంగా ఈ ఏడాది 5 నెలల్లో 125 మంది దుర్మరణం



బీచ్‌రోడ్డులో వాహనదారులను బ్రీత్ అనలైజర్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ : మందుబాబుల 'స్పీడ్'కు బ్రేకులు పడనున్నాయి. మద్యం తాగి వాహనాలు నడిపే వారి కిక్కు దిగనుంది. పూటుగా మద్యం తాగి ఒళ్లు తెలియకుండా వాహనాలతో రోడ్ల మీద వచ్చే వారికి చుక్కలు చూపించేందుకు నగర పోలీసులు సమాయత్తమయ్యారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారికి ఫైన్స్‌తో పాటు కటకటాల్లోకి పంపిస్తున్నారు. ఎన్నికల కారణంగా బ్రీత్ అనలైజర్ టెస్టులకు తాత్కాలికంగా నిలిపివేసిన పోలీసులు.. ఇటీవల జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలతో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. విస్తృతంగా ప్రతి జంక్షన్‌లోను తనిఖీలు నిర్వహిస్తున్నారు.

వాహనాలతో చెలరేగిపోతున్న మందుబాబులు : ఎన్నికల కారణంగా పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టులు నిలిపివేశారు. అయితే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు, స్టాపర్లు, మలుపులు ఉన్న రహదారుల్లో వాహనాల స్పీడ్‌కు కళ్లెం వేసేందుకు స్పీడ్ బ్రేకర్లు, భారీ వాహనాలు నగరంలోకి రాకుండా మళ్లింపు, ప్రతి జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఏర్పాటు.. ఇలా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవడంతో రోడ్డు ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయితే కొంత మంది మందుబాబులు మాత్రం మద్యం తాగి రోడ్ల మీద వాహనాలతో రెచ్చిపోతున్నారు. కొందరు ఒంటి మీద తెలివిలేకుండా వాహనాలను నడిపి సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురైతే.. మరికొందరు ఇతర వాహనాలను ఢీకొడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు. ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 90 శాతం మద్యం తాగి వాహనాలు నడిపే వారి కారణంగానే సంభవించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నెలలోనే వరుసగా మందుబాబులు వాహనాలతో బీభత్సం సృష్టించారు.

ఇక ప్రత్యేక డ్రైవ్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఇప్పటికే అన్ని చర్యలు చేపడుతున్నారు. అయితే కొంత మంది మందుబాబులు ప్రధాన జంక్షన్లలో పోలీసుల తనిఖీలు తప్పించుకోడానికి వీధుల్లో ప్రయాణిస్తున్నారు. పోలీసుల కళ్లుగప్పి ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో పోలీసులు ప్రధాన జంక్షన్లలోనే కాకుండా బార్ అండ్ రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లోనే తనిఖీలు నిర్వహిస్తూ మందుబాబుల ఆట కట్టిస్తున్నారు. దీంతో ప్రతి రోజు 100 నుంచి 125 మంది పోలీసులకు చిక్కుతున్నారు.

రోజూ 100 నుంచి 125 మందిపై కేసులు

పోలీసుల తనిఖీల్లో ప్రతి రోజు 100 నుంచి 125 మంది మందుబాబులను పట్టుకొని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఎక్కువ సార్లు దొరికిన వారిని ఫైన్‌తో పాటు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రెండు నుంచి వారం రోజుల పాటు రిమాండ్‌కు కూడా పంపిస్తున్నారు. ఇకపై ఈ తనిఖీలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు.

బీచ్ రోడ్డులో ప్రత్యేక దృష్టి

ప్రధానంగా బీచ్ రోడ్డులో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉండే బీచ్ రోడ్డు మందుబాబులు వాహనాలతో అతివేగంగా వెళుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అతివేగంగా, ర్యాష్‌గా వాహనాలు నడిపే వారితో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలే..



మద్యం తాగి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. తల్లిదండ్రులు పిల్లలకు బైక్‌లు ఇవ్వడమే కాదు.. వారు ఏ విధంగా వాహనాలు నడుపుతున్నారో, ఎటువంటి పరిస్థితుల్లో ఇంటికి వస్తున్నారో గమనించాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఫలితంగా ప్రమాదాలు, మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయితే ఈ మద్యం తాగి వాహనాలు నడిపే వారి కారణంగా అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి వారిపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. బ్రీత్ అనలైజర్ టెస్టులు విస్తృతం చేస్తున్నాం. ఒకటి, రెండుసార్లు ఫైన్ కట్టినా కూడా పద్ధతి మార్చుకోని వారిని రిమాండ్‌కు పంపిస్తున్నాం.

– డాక్టర్ ఎ.రవిశంకర్, నగర పోలీస్ కమిషనర్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా కమిటీ

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎన్నికల తరు**వాత భయానక** వాతావరణం నెలకొంది. **టీడీపీ దాడులతో** రాష్ట్రంలో అత్యంత దారుణ **పరిస్థితులు నెలకొ**న్నాయి. ప్రభుత్వం ఏర్పాటు **కాక ముందే టీడీపీ** మూకలు రాష్ట్ర వ్యాప్తంగా **చెలరేగిపోతున్నా**యి. ఎక్కడికక్కడ దాడులు **చేస్తున్నాయి. దౌర్జన్యా**లకు దిగుతున్నాయి.

పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతూ అత్యంత పాశవికంగా ప్రవర్తిస్తున్నాయి. ఈ సమయంలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తోడుగా నిలిచేందుకు 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు కమిటీలను పార్టీ ఏర్పాటు చేసింది. ప్రతీ కార్యకర్తకూ, ప్రతీ అక్కచెల్లెమ్మకూ, ప్రతీ అన్నదమ్ముడుకూ సోషల్ మీడియా సైనికులకు ఈ కమిటీలు తోడుగా నిలుస్తాయి. బాధిత కుటుంబాలను పరామర్శించడమే కాకుండా..వారికి అన్ని రకాలుగా న్యాయపరంగా, వైద్యపరంగా, ఆర్థికంగా సహాయంగా నిలుస్తాయి.

పార్లమెంట్ నియోజకవర్గం కమిటీ

1. గుడివాడ అమర్‌నాథ్
2. కోలా గురువులు
3. బొత్స ఝాన్సీలక్ష్మి
4. ఎమ్మెల్సీ వరుదుకల్యాణి
5. ముత్తంశెట్టి శ్రీనివాసరావు
6. కదుబండి శ్రీనివాసరావు
7. వాసుపల్లి గణేష్‌కుమార్
8. ఎంవీవీ సత్యనారాయణ
9. కె.కె.రాజు
10. ఆడారి ఆనంద్‌కుమార్

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

3,968 మంది హాజరు

మురళీనగర్: పాలిసెట్ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. వాస్తవానికి ఈ నెల 3వ తేదీతో కౌన్సెలింగ్ పూర్తి కావాల్సి ఉండగా 4వ తేదీన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 6వ తేదీకి వాయిదా వేశారు. జిల్లా వ్యాప్తంగా కౌన్సెలింగ్ పూర్తయ్యేనాటికి కంచరపాలెం గైస్, పాలిటెక్నిక్, పెందుర్తి పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రాల్లో మొత్తం 3,968 మంది తమ సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారు. గైస్‌లో 1,568 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 1814, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 586 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. గురువారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు గైస్‌లో 225 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 263 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 68 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు.

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్న విద్యార్థులు శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీలోగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ పాలిటెక్నిక్‌లలో చేరడానికి వీలుగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని, మధ్యవర్తులను నమ్మవద్దని వారు విద్యార్థులకు సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఈ కేంద్రాలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని చెప్పారు. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు ఇతరులకు ఇవ్వవద్దని హెచ్చరించారు.

ఇవీ కాలేజీలు

ఉమ్మడి జిల్లాలో 8 ప్రభుత్వ, 19 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల, గైస్, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల , భీమిలి మహిళా పాలిటెక్నిక్, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాడేరు రెసిడెన్షియల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కాలేజీలకు సంబంధించి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్), అనకాపల్లి పాలిటెక్నిక్, నర్సీపట్నం , భీమిలి మహిళా కాలేజీలకు ఇప్పటికే ఎన్‌బీఏ గుర్తింపు వచ్చింది. మిగతా ప్రభుత్వ కాలేజీలకు కూడా ఎన్‌బీఏ గుర్తింపు త్వరలోనే రానుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆచితూచి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు, ఇతర ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో కోర్సులను సరి చూసుకుని ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

విజయవంతంగా ఆపరేషన్ కాంబోడియా

- మరో నలుగురిని తీసుకొచ్చిన పోలీసులు
- ఇందులో నగరానికి చెందిన వారు ఇద్దరు
- ఇప్పటి వరకు భారత్ తిరిగొచ్చిన బాధితులు 68 మంది
- ఇందులో విశాఖకు చెందిన వారు 28 మంది
- ఈ రాకెట్‌లో నగరానికి చెందిన 11 మంది ఏజెంట్ల హస్తం
- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్



వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్. చిత్రంలో బాధితులు

అల్లిపురం: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కాంబోడియా' విజయవంతంగా కొనసాగుతోందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఇప్పటివరకు 21 మంది ఏజెంట్ల ద్వారా కాంబోడియాకు అక్రమంగా తరలించిన 158 మందిలో 68 మందిని భారత్‌కు తీసుకొచ్చామని వెల్లడించారు. వీరిలో నగరానికి చెందిన వారే కాకుండా రాష్ట్రం, ఇతర రాష్ట్రాల వారు ఉన్నట్లు తెలిపారు. కాంబోడియా నుంచి ఈ నెల 4న తీసుకువచ్చిన నలుగురు బాధితులతో కలసి గురువారం ఆయన పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కేసు వివరాలు వెల్లడించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరిట కాంబోడియాలోని చైనా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న మరో నలుగురు బుధవారం ఇండియాకు క్షేమంగా తిరిగివచ్చారు. ఇందులో తాటిచెట్లపాలేనికి చెందిన హేమంత్ కుమార్, కంచరపాలేనికి చెందిన రూపేష్ కుమార్ ఉన్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప కంబోడియాలోని ఇండియన్ ఎంబసీ ద్వారా అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి వీరిని విశాఖపట్నం తీసుకొచ్చారు. ఇప్పటివరకు మొత్తం 21 మంది ఏజెంట్ల ద్వారా 158 యువకులను కంబోడియాకు అక్రమంగా తరలించగా.. వీరిలో 68 మందిని తిరిగి ఇండియా తీసుకొచ్చారు. ఇందులో 28 మంది విశాఖ వాసులు ఉన్నారు. మిగిలిన 90 మంది రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో మూడు, గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. 21 మంది ఏజెంట్లలో నగరానికి చెందిన 11 మందిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. కాంబోడియా నుంచి సైబర్ నేరాలు చేయడానికి మనుషులను అక్రమంగా తరలిస్తున్న ఏజెంట్లను పట్టుకోడానికి ఇండియన్ ఎంబసీ ద్వారా లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేయడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్ కోసం 20 రోజుల సమయం పట్టిందని, మరో 20 మంది ముఠా సభ్యులు పరారీలో ఉన్నట్లు సీపీ తెలిపారు. కంబోడియాలో పనిచేస్తున్న సైబర్ ముఠా భారత్‌కు చెందిన సిమ్‌లను వినియోగిస్తోందని సీపీ పేర్కొన్నారు.

నేరం గుర్తించారిలా.!

ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకోవడంలో ముందుండే విశాఖపట్నం పోలీసులు మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. ఇటీవల ఏర్పాటు చేసిన ఆధునిక సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ ల్యాబ్‌లోని ఫండ్ ట్రైల్ సాఫ్ట్‌వేర్ ద్వారా డబ్బుల లావాదేవీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి.. ఈ డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో ఆరా తీశారు. కొంత మొత్తం క్రిప్టో కరెన్సీలోకి మారి.. తర్వాత చైనా దేశానికి తరలి వెళ్తున్నట్లు గుర్తించారు. ఈ నేరాలకు ఉపయోగిస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, ఇతర స్కైప్ ఐడీల ఐపీలు కంబోడియా, మయన్మార్ బోర్డర్‌కు చెందిన ప్రాంతాలుగా నిర్ధారించారు. ఇదే కాకుండా ఫెడెక్స్, టాస్క్ గేమ్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ నేరాలకు సంబంధించి ఐపీలన్నీ కూడా కంబోడియా దేశానికి చెందినవిగా గుర్తించారు. అక్కడి నుంచే సైబర్ స్కామ్‌లు చేస్తూ.. అమాయకులకు చెందిన డబ్బులను కొల్లగొడుతున్నారని ఇన్వెస్టిగేషన్‌లో తేల్చారు. సైబర్ క్రైం చేయడానికి ఇంటర్నేషనల్ హ్యూమన్ ట్రాఫికింగ్ సిండికేట్ ద్వారా మనుషుల అక్రమ రవాణా చేస్తు న్నట్లు మొదటిసారిగా నగర పోలీసులే కనుగొన్నారు. ఈ రాకెట్ వెనుక ఉన్న దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన 21 మంది ఏజెంట్లు, సైబర్ క్రైం ముఠాలకు సంబంధించిన ఫేక్ సిమ్‌లు, బ్యాంక్ ఖాతాలను కూడా గుర్తించారు. ఇప్పటికే నగరానికి 11 మంది ఏజెంట్లను అరెస్ట్ చేశారు. మిగిలిన వారిని కూడా పట్టుకుంటామని సీపీ వెల్లడించారు. వీరి కోసం ఏడు స్పెషల్ పోలీస్ బృందాలు పనిచేస్తున్నట్లు వివరించారు. ఇటువంటి ఏజెంట్ల చేతిలో ఇంకా ఎవరైనా మోసపోయినట్లయితే.. వెంటనే సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.భవానీప్రసాద్(94906 17917), కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 0891-2565454, వాట్సాప్ నంబర్ 949333 6633కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్నట్లయితే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

కమిషనర్‌కు భయపడుతున్నారు

ఇండియాకు తిరిగొచ్చిన బాధితులు మాట్లాడుతూ భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి చైనా స్కామర్లు కాంబోడియా నుంచి ఈ రకమైన స్కామ్‌లు చేస్తున్నారని తెలిపారు. భారత్‌కు చెందిన యువతను అక్కడకు తీసుకెళ్లి కంపెనీలకు 4 వేల డాలర్లకు అమ్మేస్తున్నారని, ఉద్యోగం చేయలేక వెళ్లిపోతామంటే ఆ 4 వేల డాలర్లు కడితేనే పాస్‌పోర్టులు ఇస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఒక్క పూట మాత్రమే భోజనం పెడుతున్నారని, తాగడానికి నీరు లేకుండా, ఒకటే బాత్రూం, జైల్లు లాంటి గదుల్లో కుక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ లాంటి వారు అక్కడ లక్షల మంది ఉన్నారని తెలిపారు. భారత్‌లో రిటైర్ అయిన డిఫెన్స్ ఉద్యోగులే లక్ష్యంగా ఫేస్‌బుక్ ఐడీల ద్వారా గుర్తించి వారితో ఇండియన్ సిమ్‌లతో మాట్లాడించడం, వారిని లోబరుచుకోవడం, వారి రిటైర్‌మెంట్ డబ్బులను కాంబోడియన్స్ ఖాతాల్లో ట్రాన్స్‌ఫర్ చేయడమే ఇక్కడి నుంచి వెళ్లిన యువతుల పని అని చెప్పారు. అలా చేయకపోతే మరిన్ని గంటలు పనిచేయించేయిస్తున్నారని తెనాలికి చెందిన ఓ మహిళ తెలిపారు. విశాఖ పోలీస్ కమిషనర్ ఫొటోను చూపించి ఎయిర్‌పోర్టుకు రమ్మన్నారని చెబితే కంపెనీ ప్రతినిధులు పాస్‌పోర్టు ఇచ్చారని.. కమిషనర్‌కు వారు భయపడుతున్నారని బాధితులు వివరించారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫకీరప్ప, సైబర్ క్రైం సీఐ భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని అలిగిన భర్త

ప్రకటనల హోర్డింగ్ ఎక్కి హల్‌చల్



హోర్డింగ్ ఎక్కిన వర్మ

బీచ్‌రోడ్డు: భార్య పుట్టింటికి వెళ్లిందని అలిగిన ఓ భర్త బీచ్‌రోడ్డులోని ప్రకటనల హోర్డింగ్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత ఐటీఐ జంక్షన్‌కు చెందిన కుమార్ చంద్రశేఖర్ వర్మ, అతని భార్య మధ్య గొడవలు జరగడంతో ఆమె బుధవారం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వర్మ గురువారం రాత్రి 9 గంటల సమయంలో బీచ్‌రోడ్డులోని ప్రకటనల హోర్డింగ్ ఎక్కి నిరసన తెలిపాడు. ఇది గమనించిన సందర్శకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వర్మకు నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. తన భార్య తిరిగి వస్తేనే దిగుతానని, లేకపోతే దూకేస్తానని వర్మ వారికి స్పష్టం చేశాడు. ఈ విషయాన్ని వర్మ కుటుంబ సభ్యులకు పోలీసులు తెలిపారు. అగ్నిమాపక వాహనం తీసుకొచ్చి వర్మను దిప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

అమృత్ భారత్ రైళ్లకు అపూర్వ స్పందన

- పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్న రైళ్లు
- ఏడాదిలో 18,423 ట్రిప్పులు
- ప్రయాణికుల్లో 26-45 ఏళ్ల వారే ఎక్కువ



తాటిచెట్లపాలెం: అమృత్ భారత్ పేరిట నడుస్తున్న వందే భారత్ రైళ్లకు ప్రారంభం నుంచి మంచి స్పందన లభిస్తోంది. భారతదేశంలో 2019లో విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్/ట్రైన్ 18లు అనతి కాలంలోనే ప్రజాదరణ పొంది, పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ప్రయాణికులు కూడా అద్భుతమైన అనుభూతిని పొందుతున్నారు. ఈ రైళ్లు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారై, భారతదేశ ఇంజినీరింగ్ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్తున్నాయి.

విశాఖ నుంచి మూడు : విశాఖపట్నం- సికింద్రాబాద్-విశాఖపట్నం, విశాఖపట్నం-భువనేశ్వర్-విశాఖపట్నంల మధ్య మొత్తం మూడు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇవి ప్రతీరోజు పూర్తి ఆక్యుపెన్సీతో నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు చెప్తున్నారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తయారైన ఈ రైళ్లలో ప్రయాణాలకు మధ్య తరగతి ప్రయాణికులు సైతం వెనుకాడటం లేదు. దీంతో ఈ రైళ్లకు పూర్తి డిమాండ్ నెలకొంది.

వందేభారత్ రైళ్లలోని సౌకర్యాలు

- ఈ రైళ్లు అధునాతన కోచ్‌లతో, పూర్తి భద్రతతో కూడినవి.
- ప్రమాదాలలో సైతం తట్టుకునేలా(కవచ్) డిజైన్ చేశారు.
- సాధారణ రైళ్ల కన్నా వీటి వేగం ఎక్కువ. గంటకు 160 కి.మీ.ల వేగంతో ఇవి ప్రయాణించగలవు.
- ప్రయాణికులు కోచ్‌ల మధ్య సంచరించేందుకు పూర్తి రక్షణతో కూడిన ఏర్పాట్లున్నాయి.
- ఆటోమేటిక్ ప్లగ్ డోర్స్
- సౌకర్యవంతమైన, రివాల్వింగ్ సీటింగ్
- ప్రతీ సీట్ వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు
- హాట్‌కేస్, బాటిల్ కూలర్, డీప్ ఫ్రీజర్, హాట్ వాటర్ బాయిలర్స్‌తో కూడిన మినీ పాంట్రీ
- ప్రతీకోచ్‌లో అత్యవసర కిటికీలు, అగ్నిమాపక ఏర్పాట్లు
- అన్ని కోచ్‌లలోనూ సీసీటీవీలు
- అత్యవసర అలారం పుష్ బటన్స్
- కోచ్ కండిషన్ మానటరింగ్ సిస్టం తదితర సౌకర్యాలు, ఏర్పాట్లు ఉన్నాయి.

ఏడాదిలో వందే భారత్ రైళ్ల గణాంకాలు

- వందే భారత్(అమృత్ భారత్)రైళ్లు 102
- నడిచిన ట్రిప్పులు 18,423
- ఆక్యుపెన్సీ105.7 శాతం
- అత్యధిక ఆక్యుపెన్సీ 175.3 శాతం(కేరళ)
- మొత్తం ప్రయాణికుల్లో పురుషులు- 61.7 శాతం, స్త్రీలు-38.3 శాతం
- అధికంగా ప్రయాణించిన ప్రయాణికుల వయస్సు గ్రూప్ 26-45 ఏళ్ల మధ్య వయస్కులు

తస్మాత్ జాగ్రత్త

- అంతర్జాతీయ రైల్వే లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు ప్రారంభం
- జాగ్రత్తగా ఉండకపోతే కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే యత్నం



అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన ర్యాలీ

తాటిచెట్లపాలెం: ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా ప్రతి ఏడాది నిర్వహించే అంతర్జాతీయ లెవెల్ క్రాసింగ్ వారోత్సవాలు గురువారం రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్వేస్ సహకారంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 'తస్మాత్ జాగ్రత్త.. ఒక్క క్షణంలో మీ జీవితం తారుమారు కావచ్చు' అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం, సేఫ్టీ పర్సనల్, సివిల్ డిఫెన్స్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకు డివిజన్ పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డీఆర్‌ఎం కార్యాలయం వద్ద గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాకారులు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు లెవెల్ క్రాసింగ్స్ వద్ద భద్రతాపరంగా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన రైల్వే భారతీయ రైల్వే అని, ట్రాక్‌లను దాటేటపుడు ప్రతీ ఒక్కరూ సురక్షిత విధానాలను పాటించాలని తెలిపారు. ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్ నేతృత్వంలో లెవెల్ క్రాసింగ్ గేట్స్ వద్ద, జన సమ్మర్దం ఉన్న చోట్ల, రైల్వే ట్రాక్స్ పరిసర ప్రాతాల కాలనీలలో ప్రత్యేక అవగాహన డ్రైవ్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, డివిజినల్ పి.వే శిక్షణా సంస్థ ప్రిన్సిపల్ ఎం.సత్యనారాయణ, సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వై.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తళుకుల మాటున కల్తీ మాయ

ప్రజల జీవన శైలిలో అనేక మార్పులు వచ్చాయి.. ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు చాలా మంది ప్రాధాన్యమిస్తున్నారు. ఇదే ప్రధాన సమస్యగా మారుతోంది. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు తిని రోగాల బారిన పడుతున్నారు. క్యాన్సర్ రోగుల్లో 53 శాతం మంది కల్తీ ఆహారంతోనే సమస్య తెచ్చుకున్నారని పలు సర్వేలు వెల్లడించడం ప్రమాద తీవ్రతను తెలియజెబుతోంది.

- బయట దొరకని నాణ్యమైన ఆహారం
- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచికోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- స్వాగతం పలుకుతున్న సరికొత్త రోగాలు
- హోటళ్లలో అధికారుల నామమాత్రపు తనిఖీలు



మహారాణిపేట: కొన్నాళ్ల కిందట వరకు ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు ఉన్నపుడే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునే వారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యం గానూ మంచి లక్షణమే. ఇప్పుడు 'కల్చర్' మారింది. 'సోషియల్ బిహేవియర్'లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా 'పార్టీ కల్చర్' వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్...సందర్భం ఏదైనా 'పార్టీలు' ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే ప్రాధాన్యమిస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు గానీ, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటి వల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

అనుమతిలేని వ్యాపారాలు

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. ఈ శాఖలో నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగు కాలువలు, చెత్త కుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు.

కల్తీ జరుగుతోంది ఇలా..

- పాలల్లో మున్సిపల్ కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టును మిశ్రమం చేస్తున్నారు. దీనివల్ల ఊపిరితిత్తులు పాడైపోయే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్లలో ఆకట్టుకునేందుకు గాను ఎక్కువగా హానికరమైన రంగులను వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.
- నిషేధానికి గురైన క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నా అడిగే నాథుడు లేరు. వీటిని చికెన్, మటన్ వ్యర్థాలతో చెరువులు, నదుల్లో పెంచి పోషిస్తారు.
- మిరపకాయల్లో ఎరుపు రంగు రావడానికి సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతారు. వీటిని వంటలో వినియోగిస్తే క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఆహారాన్ని వండే సమయంలోనూ వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండుతున్నారు. దీని వల్ల క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారు వంటి ఆహార పదార్థాలు పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి వాటిని తినే వారికి అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులను సైతం అక్రమార్కులు కల్తీ చేస్తున్నారు. వీటి ధర ఎక్కువగా ఉండటంతో అందులో ఆలుగడ్డ, ఉల్లిగడ్డ పేస్ట్‌లను కలుపుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

విశాఖపట్నం ప్రముఖ పర్యాటక ప్రాంతం. ఇక్కడ చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, డాబాలు, చాట్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, టిఫిన్ షాపులు లెక్కలేనన్ని ఉన్నాయి. వీటి ద్వారా ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. వీరు నెలకు 12 శాంపిల్స్ సేకరించాలని ఉంది. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు చేయాల్సి ఉంది. కల్తీని బట్టి క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. అక్కడక్కడ.. అప్పుడప్పుడు మినహా పూర్తి స్థాయిలో తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.



ఆహారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

ఇవి ప్రమాదకరం

- మెటానియల్ ఎల్లో వాడకం నిషేధం. కానీ వినియోగిస్తున్నారు. ఇది ఆరోగ్యంపై వెంటనే దుష్ప్రభావం చూపించదు. నెమ్మదిగా క్యాన్సర్‌కు కారకమవుతుంది. చిన్నారుల్లో నిద్రలేమి, నరాల సంబంధిత వ్యాధులు వస్తాయి.
- వంటకాల్లో రంగుకోసం వాడే నిషేధిత టార్టాజిన్ చాలా ప్రమాదకరం. దీంతో మానసిక వ్యథ, థైరాయిడ్, క్యాన్సర్, ఎలర్జీ, దద్దుర్లు, తామర, రక్తకణజాలంలో హానికర కణజాలాల వృద్ధి చెందడం, డీఎన్ఏ నష్టపోవడం, నిద్రలేమి, నీరసం వస్తాయి.
- స్వీట్లు, బిస్కెట్లలో ఆరెంజ్ రంగు కోసం వాడే సన్‌సెటన్, పసుపు రంగు కోసం వాడే కాట్రాజ్, గ్రీన్ కలర్ కోసం వాడే బ్రిలియంట్ బ్లూ, టార్టాజిన్లు ప్రమాదకరమే
- చాక్లెట్లలో వాడే రోడ్‌మన్-బి కూడా ప్రాణాంతకమే! అయినా చాక్లెట్లు, చిన్నపిల్లలు తినే రంగుల ఆహారపదార్థాల్లో వీటిని వినియోగిస్తున్నారు.
- రెస్టారెంట్లు, బేకరీ ఆహారాన్ని వరసగా 40 రోజులు తింటే కీళ్లనొప్పులు, జీర్ణసంబంధిత వ్యాధులు వస్తాయి. మరింత అధికమైతే క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

నగరంలో గత ఏడాదిలో 119 కేసులు నమోదు చేశాం. పలు హోటళ్లు, రెస్టారెంట్లు, రిటైల్, హోల్‌సేల్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు జరిమానా విధించాం. ఎక్కడైనా ఆహారంలో కల్తీ జరిగిందని తెలిసి ఎవ్వరైనా ఫిర్యాదు చేస్తే అక్కడకు వెళ్లి శాంపిల్స్ సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం. ఎవరికైనా అనుమానం వస్తే 98490 47761, 9912199284కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– జి.ఎ.బి. నందాజీ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్

నీట్ ఫలితాల్లో ఎసెంట్ ప్రభంజనం

సీతంపేట: నీట్-2024 ఫలితాల్లో ఎసెంట్ విద్యార్థి బొమ్మి ఢిల్లీరావు 685 మార్కులు సాధించిన సందర్భంగా కళాశాల క్యాంపస్‌లో గురువారం అతన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.వి.ఆర్. మురళీకృష్ణ విద్యార్థిని అభినందించారు. ఇదే కళాశాల నుంచి ఐ.గంగాభవాని 671, ఎం.రిషి సాత్విక్ 671, ఆర్.జ్యోతిర్మయి 670 మార్కులు సాధించి సత్తా చాటారు. వీరితో పాటు మరో 12 మంది 650 పైగా మార్కులు, 39 మంది విద్యార్థులు 600 పైగా మార్కులు సాధించారు. 67 మంది 550 మార్కులు సాధించారని డైరెక్టర్ వెల్లడించారు. ఒకే క్యాంపస్ నుంచి 225 మందిలో 100 మంది సీట్లు సాధించారన్నారు. విశేష ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



బొమ్మి ఢిల్లీరావును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ ఎం.వి.ఆర్.మురళీకృష్ణ

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం: బెంగళూరుకు గంజాయి తరలించేందుకు యత్నిస్తున్న వ్యక్తులను టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. కర్నాటకకు చెందిన కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర ఒడిశా సరిహద్దులో శ్యామ్ సుందర్ కిముండి వద్ద ఆరు కిలోల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేశారు. గంజాయితో బెంగళూరు వెళ్లేందుకు ప్రయత్నించగా.. పక్కా సమాచారంతో ఎన్ఏడీ వద్ద టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు వారిని పట్టుకున్నారు. కిరణ్‌కుమార్ చెన్నప్ప, శివరాజ్ గజేంద్ర, శ్యామ్ సుందర్ కిముండిని అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ చక్రధరరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

రక్షక్ వాహనాన్ని ఢీ కొట్టిన ట్యాంకర్

ఎస్ఐకి స్వల్పగాయాలు



క్రైం ఎస్ఐ మన్మథరావు కంటిపై గాయం

అక్కిరెడ్డిపాలెం: నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రక్షక్ వాహనాన్ని ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావుకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. బుధవారం అర్ధరాత్రి సమయంలో గాజువాక క్రైం ఎస్ఐ ఎ.మన్మథరావు నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. షీలానగర్ పెట్రోల్ బంక్ దాటి అక్కిరెడ్డిపాలెం వైపు వస్తున్న సమయంలో లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల సమీపంలో రక్షక్ వాహనాన్ని వెనుకనే వస్తున్న ట్యాంకర్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రక్షక్ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న డివైడర్ పైకి దూసుకుపోయింది. వాహనం వెనుక భాగం నుజ్జయ్యింది. వాహనంలో ముందు కూర్చొని ఉన్న ఎస్ఐ మన్మథరావు కంటి పైభాగంలో స్వల్ప గాయమైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



దెబ్బతిన్న రక్షక్ వాహన వెనుకభాగం

బై.. బై.. వైజాగ్

కొమ్మాది: నటుడు విజయ్ దేవరకొండ గురువారం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఆయన నటిస్తున్న ఓ చిత్రానికి సంబంధించి షూటింగ్ కోసం గత నెల 5న నగరానికి చేరుకున్నారు. అప్పటి నుంచి నిర్విరామంగా ఆర్.కె.బీచ్, యారడా బీచ్, తిమ్మాపురం, తదితర ప్రాంతాల్లో జరిగిన పలు సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ న్యూలుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. 30 రోజుల పాటు వైజాగ్‌లో తన సినిమా చిత్రీకరణలో పాల్గొనడం ఎంతో ఆనందం ఇచ్చిందని, బ్యూటిఫుల్ వైజాగ్‌ను విడిచి వెళ్లడం కాస్త బాధగా ఉందని విజయ్ అన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఉపసంచాలకుల కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 8 ప్రీమెట్రిక్, 14 పోస్ట్ మెట్రిక్ వసతిగృహాల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ప్రీమెట్రికల్‌లో నాలుగు బాలురు, నాలుగు బాలికల వసతిగృహాల్లో 872, పోస్ట్ మెట్రిక్‌లో 7 బాలురు, 7 బాలికల వసతిగృహాల్లో 672 సీట్లు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు రోస్టర్ ఆధారంగా ఈ ప్రవేశాలు కల్పించనున్నట్లు కార్యాలయం వెల్లడించింది. మరిన్ని వివరాలకు ఎంవీపీకాలనీ సెక్టార్–9లోని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయం, భీమిలిలోని సహాయ సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

ఉచిత శిక్షణ.. ఉపాధి కల్పన

శిక్షణ స్వల్పకాలమే... సొంత కాళ్లపై ఎదిగేలా తర్ఫీదు ఇస్తోంది. స్వయం ఉపాధి పొందేలా మార్గం చూపిస్తోంది. చేతిలో పట్టా ఉన్నా కొలువు దొరకని వారికి దర్జాగా బతికేలా భరోసా కల్పిస్తోంది. ఇలా ఎంతోమంది జీవితాల్లో ఉపాధి వెలుగులు నింపుతున్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ గ్రామీణ నిరుద్యోగులకు వరంగా మారింది.



అగరబత్తిలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు

- వివిధ కోర్సుల్లో 9,031 మందికి తర్ఫీదు
- ఇంతవరకు 7,590 మందికి స్వయం ఉపాధి
- శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం
- గ్రామీణ నిరుద్యోగులకు వరం
- అనకాపల్లిలో ఎస్‌బీఐ ఆర్ఎస్ ఈటీఐ శిక్షణ

అనకాపల్లి: డిగ్రీలు, పీజీలు చేసినా సరైన స్కిల్ లేక ఉద్యోగం, ఉపాధి దొరక్క దిక్కుతోచని స్థితిలో ఉన్నవారు.. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మధ్యలో చదువు ఆపేసిన వారు... నిరుత్సాహం పడాల్సిన పనిలేదు. ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ వివిధ ట్రేడ్‌ల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తోంది. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో 2009 జూలై 1న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రారంభించింది. విశాఖ ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంత యువకుల ఉపాధి కల్పనకు బాటలు వేస్తోంది. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఇస్తోంది. శిక్షణ అనంతరం వారు కోరుకున్న బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తూ స్వయం ఉపాధి కల్పిస్తోంది. ఈ సంస్థకు చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సుగల గ్రామీణ నిరుద్యోగులను మాత్రమే ఎంపిక చేసుకుని వివిధ ట్రేడుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. సంస్థను ప్రారంభించి నాటి నుంచి నేటి వరకూ 9,031 మందికి శిక్షణ ఇచ్చారు. ఆయా వృత్తులలో నైపుణ్యం సాధించిన 7,590 మందికి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేశారు. ముద్రా పథకం కింద ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ రుణ సదుపాయం కల్పించారు. 2024–25 సంవత్సరంలో నేటికి ఐదు బ్యాచ్‌ల్లో 136 మంది శిక్షణ పొందగా, నేటికి 24 మందికి ఉపాధి కలిగింది. ఈ ఏడాది మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. శిక్షణ కాలంలో ఒక్క రూపాయి కూడా సంస్థ తీసుకోకుండా ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ) ద్వారా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీ ప్రపంచంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని శిక్షకులు చెబుతున్నారు.

శిక్షణ వివరాలు

1.	ఉమెన్స్ టైలరింగ్	30 రోజులు
2.	బ్యూటీ పార్లర్	30 రోజులు
3.	ఎంబ్రాయిడరీ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్	30 రోజులు
4.	జ్యూట్ బ్యాగ్‌ల తయారీ	13 రోజులు
5.	అగరబత్తి తయారీ	10 రోజులు
6.	కొవ్వొత్తుల తయారీ	10 రోజులు
7.	అప్పడాలు, పచ్చళ్లు, మసాలా పొడర్ల తయారీ	10 రోజులు
8.	పుట్టగొడుగుల పెంపకం	10 రోజులు
9.	పాడిపశువు, వానపాముల పెంపకం	10 రోజులు
10.	సెల్‌ఫోన్ రిపేరింగ్	30 రోజులు
11.	ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ	30 రోజులు
12.	టూవీలర్ మెకానిజమ్	30 రోజులు
13.	హౌస్ వైరింగ్	30 రోజులు
14.	ఎల్.ఎం.వి.డ్రైవింగ్	30 రోజులు
15.	ఏసీ, ఫ్రిజ్‌ల సర్వీసింగ్	30 రోజులు
16.	మెన్స్ టైలరింగ్	30 రోజులు
17.	కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్	30 రోజులు

బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటున్నాను....



ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్నాను. కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు కారణంగా స్వయం శక్తిపై ఎదగాలని ఆశతో ఉన్నాను. నాకు ఇష్టమైన బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకుంటున్నాను. ఉచిత శిక్షణతోపాటు వసతి భోజనం కల్పిస్తారని నా స్నేహితురాలు చెప్పడంతో ఇక్కడ చేరాను. శిక్షణ అనంతరం సంస్థ ద్వారా మా ఇంటికి దగ్గరలో బ్యాంకు రుణం తీసుకుని బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకుంటాను.

– ఎ.హారిక, మత్స్యపురం గ్రామం, రావికమతం మండలం, అనకాపల్లి జిల్లా

టైలరింగ్ నేర్చుకుంటున్నాను...



హుకుంపేటకు ఎస్‌బీఐ ప్రతినిధులు వచ్చి సమావేశం నిర్వహించారు. నిరుద్యోగ మహిళలకు శిక్షణలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని చెప్పారు. మా కుటుంబ సభ్యులతో మాట్లాడి టైలరింగ్ శిక్షణకు వెళ్లాతానని చెప్పాను. శిక్షణ ఎంతో బాగా ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేశారు. వసతి, భోజనం బాగుంది. 30 రోజులు శిక్షణ పూర్తి చేసుకుని మా ఇంట్లోనే టైలరింగ్‌తో స్వయం ఉపాధి పొందాలని అనుకుంటున్నాను.

– ఓ.స్నేహిత, గూడ గ్రామం, హుకుంపేట మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఎస్‌బీఐ శిక్షణ సంస్థ ఉపాధి కల్పించింది



నేను ఇంటర్ వరకు చదువుకున్నాను. కొన్నాళ్లపాటు ప్రైవేటు ఉద్యోగం చేశాను. కాని జీతం చాలకపోవడంతో కుటుంబాన్ని పోషించడానికి చాలా కష్టంగా మారింది. పెద్దగా చదువులేకపోవడంతో, చేతిలో సరైన నైపుణ్యం లేక ఏం చేయాలో తెలియక బాధపడేవాడిని. ఏదో చేయాలని అనుకునే సమయంలో మా స్నేహితుల ద్వారా అనకాపల్లి జిల్లా ఎస్‌బీఐ సంస్థలో ఉచితంగా సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో శిక్షణ పొందాను. శిక్షణానంతరం డుంబ్రిగుడలో సెల్ పాయింట్ ఏడాది క్రితం ఏర్పాటు చేసుకుని సొంత ఊరిలో నెలకు రూ.20 వేల ఆదాయం సంపాదించుకుంటూ కుటుంబ సమేతంగా జీవిస్తున్నాను.

– కె.దామోదర్, డుంబ్రిగూడ మండలం, ఏఎస్ఆర్ జిల్లా..

గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ఉద్దేశం...



ఎస్‌బీఐ, ఆర్ఎస్ఈటీఐ సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి గ్రామీణ యువతకు 17 కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఇస్తున్నాం. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, రెండు జతల యూనిఫాం, శిక్షణ పొందిన నిరుద్యోగులకు టూల్ కిట్స్ అందజేస్తున్నాం. నిరుద్యోగుల నుంచి మంచి స్పందన వస్తోంది. గ్రామీణ ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారు చాలామంది నిరుద్యోగులను తీసుకువచ్చి చేర్పిస్తున్నారు. ఎస్‌బీఐ సంస్థ ఆదేశాల మేరకు గ్రామీణ నిరుద్యోగులకు ప్రాధాన్యమిస్తున్నాం. 7వ తరగతి పాస్, 10వ తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు ఆధార్, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి.

– బి.విజయ్‌కుమార్, సంస్థ డైరెక్టర్, అనకాపల్లి